
# "ఆమె నా తల్లి"

కామరాజు సుశీల



**కుటుంబరావుది** చిన్న కుటుంబం. తను, తల్లి, భార్యా, కొడుకూనూ. కలకత్తా దగ్గర చిత్తరంజన్ రైల్వే కోచ్ ఫాక్టరీలో మెకానికల్ ఇంజనీరుగా ఉంటున్నాడు. డిపార్టుమెంటువాళ్ళిచ్చిన క్వార్టర్స్ చిన్నదైనా—శుభ్రమైనక్వార్టర్సు. తనకు ఫాక్టరీ వెళ్ళడానికి స్కూటరు ఒకటుంది.

భార్య సుమతి విద్యావతి, వినయవతి, సౌందర్యవతి, అనుకూలవతి కూడాను. అంతా బాగుంటే మనకు కథ ఏముంది అనుకుంటారేమో—అక్కడే వచ్చింది కథ అంతాను.

కుటుంబరావు పుట్టిన పది నెలల కంతా తండ్రి హఠాత్తుగా గుండెపోటుతో పోయాడు. అతని వంశంలో గుండెపోటుతో చిన్న వయస్సులోనే మరణించటం పరంపరగా వస్తోందట. అందరూ అనుకున్నారు.

ఏమయితే నేం కుటుంబరావు తల్లి వరాలమ్మ ఈ పది నెలల పసికందును నే నెలా పెంచుతాను అని బోరున ఏడ్చిందట భర్త పోయినప్పుడు.

ఈ దుర్ఘటన జరిగినప్పుడు బంధుమిత్రులంతా వచ్చి వెళ్ళారు. వరాలమ్మ తమ్ముడు, దగ్గరచుట్టాలు కర్మకాండ లయ్యేదాకా ఉండి వెళ్ళారు. నీ భవిష్యత్తు ఏమిటి అని ఎవరు గూడా అడగలేదు వరాలమ్మను. అందరూ వారి వారి నివాసాలకు జారుకున్నారు.

వయసులో చిన్న దయినా, వరాలమ్మ కష్ట సుఖాలు ఇట్టే తెలుసుకుంది. భర్తతో తను ఉండినది అద్దె ఇల్లే గనుక, అంత అద్దె ఇచ్చుకోలేనని ఆ ఇంటి నుండి ఒక చిన్న గదిలోకి మారింది. ఆ గదిలో విద్యుద్దీపం కూడా లేనందున చాల తక్కువ అద్దెలోనే దొరికింది. వివరంగా చెబితే ఆ గది ఒక పెద్ద బంగళాకు అవుటు హౌసు వంటిది. నౌకర్ల కోసం ఏర్పాటు చేయబడ్డది ఆ గది.

వరాలమ్మ ఆ గదిలోకి ప్రవేశించి పాత చీర వుయ్యాల కట్టింది. అందులో కొడుకును వూపి నిద్రపుచ్చేది. ఆబంగళాలోకిప్రొద్దున్న, సాయంత్రం వెళ్ళి వండిపెట్టి వచ్చేది. వాళ్ళిచ్చిన జీతం, పాత చీరెలు వగైరాలతో కాలం గడుపుతోంది. రోజుకు రోజు పిల్లాడు పెద్ద వాడవుతున్నాడు. ఇప్పుడు ఉయ్యాల గాకుండా ఆమెతో చాపమీద పడుకుంటున్నాడు. చెంచాతోగాక గ్లాసుతో పాలు త్రాగుతున్నాడు.

మొట్టమొదట కుటుంబరావుకు అన్నం తినిపించిన రోజు భర్త లేడనుకుని దుఃఖించింది వరాలమ్మ. భర్తతో సుఖంగా బాగా బ్రతికిన ఇల్లాలేమొ అప్పుడప్పుడు భర్తను తలచుకుని ఏడ్చేది. తల్లి ఏడుస్తుంటే కొడుకు అయోమయంగా తల్లివైపు చూసేవాడు. ఎందుకమ్మా ఏడుస్తావని అడగటానికి మాటలు రావు గదా ఆ చంటి వానికి! కాని, అతని కళ్ళు అడిగేవి. అమాంతం ఆమె పిల్లాణ్ణి ఎత్తి గుండెలకు హత్తుకునేది. ఆ క్షణాలలో ఆమె గుండె వేగంగా కొట్టుకునేది.

కొన్నాళ్ళకు మనసు గట్టి చేసుకుని కష్టాలకు అలవాటు పడింది వరాలమ్మ.

తన కొడుకు తండ్రిలేని బిడ్డఅయితేనేం—బాగా చదివించి మంచి ప్రయోజకుణ్ణి చేస్తాను. పెద్ద

ఉద్యోగస్థుడిని చేస్తాను అనుకునేది. కుటుంబరావు పుట్టినపుడు అతని తండ్రి—''ఏమేవ్! వరాలు! మనవాణ్ణి ఆఫీసరును చేస్తానే, వాలా గుమాస్తాగిరి కాదే'' అనేవాడు. ఆ మాటలు వరాలమ్మకు నేటికి గుర్తు ఉంది.

రోజులు, నెలలు, ఏళ్ళు దాటుకున్నాయి.

కుటుంబరావు స్కూలులో చేరాడు. ఖర్చులు ఎక్కువయినాయి. వరాలమ్మ బంగళాలో వండేదే గాక, హోటళ్ళకు వెళ్ళి ప్రొద్దస్తమానం పిండి రుబ్బుతోంది. అప్పుడప్పుడు డాక్టరింటికి వెళ్ళి మందులు నూరి యిస్తోవుంది.

తాను కడుపుకు ఏమి తిన్నా, లేకున్నా కొడుకుకు మాత్రం పుష్టి ఆహారమే పెడుతోంది. తాను ఏమి కట్టుకున్నా, లేకున్నా కొడుకుకుమాత్రం దర్జాగా బట్టలువేసి, క్రాపు దువ్వి అలంకరించేది. తన కొడుకును చూసిమురిసి పోయేది. తన కొడుకు తనకు పదివేలు! తన సర్వస్వం!

''కాలేజీకి కోటు, టై వేసుకుని వెళ్ళాలి గదా?'' అడిగింది.

''కోటు కుట్టించుకోడానికి టయిమేదీ?'' అన్నాడు.

''అయితే ఎలారా?'' అంది ఆత్రంగా.

''నా ఫ్రెండు నడిగి కోటు, టై కూడా తెచ్చుకుంటాను. పది రోజుల కోసం ఇవ్వమంటే ఇస్తాడు.''

''అయితే కాళ్ళకు జోళ్ళు?'' అది కంగారుగా.

''అవి కొనాలిసిందే!''

''ఎంతవుతుందేమిటి?''

''ఏమిటో చాలానే అవుతుంది.''

''రేపు వెళ్ళి టిక్కెట్టు కొనుక్కుని,చెప్పులుకూడా కొని, నీ స్నేహితు డెవడో కోటివ్వగల డన్నావే వానిని కలుసుకుని రా.''

''అలాగే నమ్మా'' అన్నాడు మృదువుగా.

''బాబూ! కలకత్తా చాలా దూరంకదా! అక్కడ నీకు నౌఖరీ అయితే ఆ కొత్త వూళ్ళో భాష తెలియక మనం బతకగలమా?''

వెళ్ళాల్సి ఉంది.''

''అయిదు వందలు కావాలా?''

''నా బంగారపు చంద్రహారం తెచ్చాను. ఇది ఉంచుకోండి'' అంటూ హారం ఇవ్వబోయింది.


''నీ హారం అక్కర్లేదు. నే డబ్బు ఇస్తాను. నీ మీద నాకు బాగా నమ్మక ముంది.''

గదిలోకి వెళ్ళి అయిదు వంద రూపాయల నోట్లు తెచ్చి ఇచ్చింది ఆ ఇల్లాలు.

''ఆపదలో ఆదుకున్న వాడే దేవు డంటారు. మీకు నా మీద ఉన్న నమ్మకం నా అదృష్టం. వీలయినంత త్వరలో తిరిగి తెచ్చి ఇస్తాను. లేకుంటే కాయకష్టం చేసి మీ ఋణం తీర్చుకుంటాను'' అంది వరాలమ్మ.

ఎందుకో వరాలమ్మ కళ్ళు కన్నీటితో మెరిశాయి. కళ్ళు వత్తుకుని వెళ్ళింది.

ఆమె వెళ్ళినదిక్కే చూసింది ఆ ఇల్లాలు—తన కొడుకు కోసం ఎంత తాపత్రయ పడుతూందో




ఫోటో_ఎమ్. శివశంకరయ్య

కాలం గడుస్తోంది. ఋతువులు మారుతున్నాయి. కుటుంబరావు స్కూలు చదువు ముగించి మెడిసిన్ ఎంట్రన్స్ పరీక్షలు వ్రాశాడు. ఇంజనీరింగులో కూడా ప్రయత్నించాడు. ఇంజనీరింగులో తనకు ఎక్కువ ఆసక్తి ఉన్నందున అందులోనే చేరాడు.

ఇంజనీరింగు కాలేజీలో ఎక్కడా మెట్టు జార కుండా పాసయ్యాడు. అయితే వరాలమ్మమాత్రం అతడు ఎక్కడో ఉద్యోగంలోచేరేదాకా వంట వండడం గాని, పిండి రుబ్బడం గాని మానకూడదని తీర్మానించుకుంది.

పేపర్లో ప్రకటనలు చూసి అప్లికేషనుపెట్టాడు కుటుంబరావు. చిత్తరంజన్ కోచ్ ఫాక్టరీకి అప్లికేషను పెట్టుకున్న పదిహేను రోజులకు ఇంటర్వ్యూకు రమ్మని రిజిస్టరు ఉత్తరం వచ్చింది. ఆ రోజు తల్లి కొడుకు లిద్దరు ఆనందంతో మునిగి తేలారు.

ఆ రాత్రి అతని కంచంలో అన్నం వడ్డిస్తూ, ''బాబూ! నీవు ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు కోటు,

''అమ్మా! ముందు నాకు నౌఖరీ అయితే భాష ఎంతసేపు నేర్చుకోవటం?'' అన్నాడు నిర్లక్ష్యంగా.

అతడు భోజనం చేసి లేచాడు.

''ఏమో! ''అని గొణుక్కుంటూ ఆలోచనలో పడింది వరాలమ్మ.

ప్రయాణం ఖర్చులు అవి ఎంత లేకున్నా నాలుగయిదు వంద లయ్యేటట్లుంది. ఆలోచించింది వరాలమ్మ. మరునాడు తిన్నగా బంగళాకు వెళ్ళి ఆ ఇంటి ఇల్లాలి నికలుసుకుంది.

''ఏం, వరాలమ్మా, ఇలా వచ్చావు?'' అంది ఆ ఇల్లాలు.

''ఏం లేదమ్మా, కొంత డబ్బు అవసర ముంది.'' అడిగింది ప్రాధేయకంగా.

''ఎంత గావలెనేమిటి?''

''అయిదు వందలు.''

''అయిదు వందలే!'' అంది ఆశ్చర్యంగా.

''అవునమ్మా! బాబుకు ఇంటర్వ్యూట, కలకత్తా

ఈ తల్లి అనుకుంటూ.

మంచి రోజంటూ రెండు రోజులు ముందుగానే కొడుకు ప్రయాణం తీర్మానించింది వరాలమ్మ. హడావిడి పడిపోతూంది.

కుటుంబరావు స్నేహితుణ్ణి అడిగి కోటు, టై తెచ్చుకున్నాడు. కోటుకు ఇస్త్రీ పెట్టించింది తల్లి. టై నాలుగు సార్లు కట్టుకుని, టై చక్కగా కట్టుకోవడానికి అలవాటు చేసుకున్నాడు కుటుంబరావు. చెప్పులు బాటా దుకాణం వెళ్ళి తెచ్చుకున్నాడు. క్రొత్త వి కరుస్తా యేమో అంటూ వాటిని రెండు రోజులు వేసుకుని వాడుకున్నాడు. రైలు టిక్కెట్టు తెచ్చుకున్నాడు.

ప్రయాణం రోజు వచ్చింది. దారిలో ఇబ్బంది పడకుండా చిన్న అల్యూమినియం డబ్బాలు రెండింట్లో తినడానికి ఏవేవో సర్దింది వరాలమ్మ.

అంతా సిద్ధమయ్యాక తల్లికి పాదాభివందనం చేసి, చిన్న సూటుకేసుతో బస్సు స్టాండుకు నడిచాడు

కుటుంబరావు. అతడు కనుమరుగయ్యే దాకా గుమ్మం దగ్గిర నిలబడింది వరాలమ్మ.

అతను కలకత్తా వెళ్ళి తిరిగి రావటానికి పది రోజులు పట్టింది. ఈ పది రోజులుకూడా వరాలమ్మ ఇంటి దగ్గర పూజలు, ప్రార్థనలు చేసింది. కొడుకు ఆఫీసరయితే అనుకుంటూ ఎన్నో కలలు కనింది. ఎన్నో వూహించుకుంది. ఆ వూహలకే ఆనందించింది.

కుటుంబరావు కలకత్తా వెళ్ళి పది రోజులకు తిరిగి వచ్చాడు. ఇంటర్వ్యూలో అంతా బాగా చేశానన్నాడు. వరాలమ్మ దేవుని పటం ముందు కొబ్బరి కాయ కొట్టి, అరటిపండ్లుకూడా తెచ్చి నైవేద్యం చేసి, కర్పూరం వెలిగించి కళ్ళ కద్దుకుంది. కుటుంబరావు ఉద్యోగ విషయంలో తాను చేయవలసిన వన్నీ చేసింది.

నెల రోజులు గడిచాయి. కలకత్తా ఆఫీసు నుండి ఉత్తరం లేదు. వరాలమ్మ, కుటుంబరావులలో కొంత విచారం, నిరాశ చోటు చేసుకున్నాయి.

కుటుంబరావు మళ్ళీ దినపత్రికలు తిరగ వేస్తున్నాడు. ఖాళీ లున్నాయంటే తనకు అర్హత లున్నాయనిపిస్తే ఆ ప్రకటనలమనసరించి వాటికి అప్లికేషన్లు పెట్టుకుంటున్నాడు.

ఆ నెలాఖరుకు కలకత్తా నుండి రిజిస్టర్డు ఉత్తరం వచ్చింది—

కుటుంబరవు చిత్తరంజన్ లోకో ఫాక్టరీలో మెకానికల్ ఇంజనీరుగా నియమించబడ్డట్టు. పదిహేను రోజులలో హాజ రవమన్నట్లు తెలియ చేసింది ఆ రిజిస్టర్డు ఉత్తరం.

ఆ ఉత్తరం వచ్చిన రోజు ఇంట్లో దేవుని పటాల ముదు జ్యోతులు వెలిగించి, కర్పూర హారతి ఇవ్వడమే కాక, ఆ సాయంత్రం వరాలమ్మ, కుటుంబరావు లిద్దరు కలిసి దగ్గరున్న గుడి కెళ్ళి కొబ్బరి కాయ కొట్టి, అర్చన చేయించి, ప్రదక్షిణలుకూడా చేసి వచ్చారు.

ఆ రాత్రి కొడుకు కంచంలో వడ్డించి, తాను కూడా తన కంచంలో వడ్డించుకుని ఎదురుగా కూర్చుంది వరాలమ్మ.

"నీవు కొన్ని బట్టలు కుట్టించుకోవాలెరా!" అంది అర్థిస్తున్నట్లు.

"నా స్నేహితులు కోటు, షై తిప్పి ఇస్తే నన్నే ఉంచుకోమన్నాడమ్మా. ఇప్పుడు నాకు బట్టలు అవసరం లే"దన్నాడు.

"నీ ఇష్టం, బాబూ! నిన్ను ఆఫీసరును చేయాలెనన్నారు నీ తండ్రి! ఈరోజు నీవు ఇంజనీరుగా చార్జి పుచ్చుకుంటె చూసే అదృష్టం ఆయనకు లేకపోయింది. ఆ పై నుండే చూసి సంతోషిస్తారులే" అని కళ్ళు తుడుచుకుంది.

అన్నం తింటూన్న కుటుంబరావు తలెత్తి తల్లి వైపు దీనంగా చూసి తల వంచేశాడు. కాసేపు ఇద్దరి మధ్య మాటలు లేవు.

"అమ్మా! నే వెళ్ళాక నీవు వంటరిగా ఉంటావు. అక్కడికి వెళ్ళి త్వరలోనే ఏవో ఏర్పాట్లు చేసి నిన్ను కూడా తీసుకెడతాను." ఆమె ముఖం ఆనందంతో వెలిగింది.

"అలాగే, బాబూ! నే మాత్రం నిన్ను వదిలి ఉండగలనా?" అంది.

కుటుంబరావు కలకత్తా వెళ్ళాడు.

అతను ఉద్యోగంలో చేరాడన్న వాళ్ళ వార్త బంధు మిత్రులకందరికీ తెలిసింది. మరేం! ఇన్నిరోజులు ఉన్నావా, లేవా అని అడగని వారు, చనువుగా మాట్లాడితే ఆదుకోవలసి వస్తుందేమో అని జడుసుకుని దూరం దూరంగానే ఉండిపోయిన దగ్గర చుట్టాలు వరాలమ్మకు ఉత్తరాలు వ్రాస్తున్నారు. కుటుంబరావును ఒక కుటుంబీకుని చేయమంటూ సంబంధాలు వస్తున్నాయి. వరాలమ్మ ఆ ఉత్తరాలు చూసుకుని సంబర పడిపోతూంది.

అయితే ఏ ఇంటర్వ్యూ లేకుండా తన తమ్ముని కూతురు సుమతిని కోడలుగా చేసుకోవటానికి వరాలమ్మ తీర్మానించింది. ఆ విషయం కొడుకుకు ఉత్తరం ద్వారా తెలియజేసింది.

ఆరునెలల వరకు తను సెలవు పెట్టకూడదన్నీ, అంతవరకు తన వివాహ విషయంలో ఆలోచించవద్దని కుటుంబరావు తల్లికి వ్రాశాడు.

అయితే వరాలమ్మ సుమతిని తన కొడుకుకు చేసుకుంటావంటూ తమ్మునికి ఉత్తరం వ్రాసింది.

అప్పుడప్పుడు కుటుంబరావు తల్లికి డబ్బు పంపుతున్నాడు. అతని మొట్టమొదటి జీతం శ్రీ వేంకటేశ్వరస్వామికి అర్పించింది.

మళ్ళీ పంపిన డబ్బు నాలుగు వందలు ఒక మారు, ఇంకో వంద రూపాయలు ఒక మారు తీసుకెళ్ళి బంగరా ఇల్లాలి కిచ్చేసింది.

ఆరునెలలు గడిచాయి.

మంచి ముహార్తం పెట్టించమని తమ్మునికి వ్రాసింది వరాలమ్మ.

కుటుంబరావు పదిహేనురోజులు సెలవు మీద వచ్చాడు.

"నేను అమ్మాయిని చూడందే!" అన్నాడు.

"ఏమిట్రా నీవు చూసేది? చిన్నతనంలో పరికిణా, చొక్కా వేసుకుని ఇంట్లో తిరుగుతున్నప్పుడు నీ వెన్నిసార్లు చూడలేదురా?" అంది ఆశ్చర్యంగా చీవాట్లు పెడుతూ.

"ఏమో నాకు గుర్తు లే"దన్నాడు.

"నీకు లేకుంటే నాకుంది గుర్తు. పసిమి రంగు, లక్ష్మీకళ. పొడుగాటి జడ. అన్నిటికి మించినది అమ్మాయి అణకువ. బి. ఎ. కూడా పాసయింది. నీకు ఇంకా ఏం కావలెరా?" అంది ఉక్రోషంగా.

"అమ్మా! నీ ఇష్టమే నా ఇష్టం" అన్నాడు.

కొడుకు ఎంత మంచివాడని సంతోషంతో ఉప్పొంగి పోయింది వరాలమ్మ.

తను ఈ రోజు ప్రయోజకుడయి, ఇంజనీరుగా వందలు సంపాదించుకుంటున్నాడంటే అంతా తన తల్లి కృషి, కృప అని కృతజ్ఞతతో నిండిపోయింది కుటుంబరావు మనసు.

సుమతి—కుటుంబరావుల పెళ్ళి సవ్యంగా లక్షణంగా జరిగింది. తన బంగారపు చంద్రహారం



కోడలి మెళ్ళో అలంకరించి తనింటికి కోడలిగా అహ్వానించి, ఆశీర్వదించింది వరాలమ్మ.

కుటుంబరావు సుమతిని పెళ్ళి చూపులంటూ చూడకనే చేసుకున్నా ఆమెను చూసి సంతృప్తి పడ్డాడు. తల్లి చెప్పిన గుణాలన్నీ ఉన్నాయి ఆమెలో.

"కలకత్తా వెళ్ళి మీ కిద్దరికి రైలు పాసులు పంపుతాను.. మీరిద్దరు కలిసి రండి" అని కుటుంబరావు కలకత్తా వెళ్ళేడు.

వరాలమ్మ మళ్ళీ తన చిన్న గదికి చేరింది.

సుమతి రైల్వే పాసుల కోసం ఎదురుచూస్తూ తలిదండ్రుల దగ్గర ఉండిపోయింది.

పదిహేను రోజుల తరవాత తల్లికి, భార్యకు పాసులు పంపాడు కుటుంబరావు. పాసు లొచ్చాయని సుమతి ఉత్తరం వ్రాస్తే—తన చిన్న గది ఒక రోజంతా సర్ది ఖాళీ చేసింది వరాలమ్మ.

బంగళా ఇల్లాలికి అవసరమయినప్పుడు ఆదుకున్నందుకు కృతజ్ఞత తెలిపి కోడలున్న వూరికి బస్సు ప్రయాణం చేసి చేరింది వరాలమ్మ.

తమ్ముడు అన్ని ఏర్పాట్లు చేసి వరాలమ్మను. సుమతిని రైలు ఎక్కించాడు.

రెండురోజులు ప్రయాణం చేసి కలకత్తా చేరారు. కుటుంబరావు హౌరాస్టేషను ప్లాటుఫారం మీద నిల్చుని చూస్తున్నాడు. అతనిని రైలు పెట్టెలో నుండి చూసి సుమతి అప్రయత్నంగా చేయి వూపింది. అతనిలో ఏదో తీయటి కల కన్నట్లయింది. అతను గూడా చేయి వూపాడు.

తల్లి, భార్య రైలు పెట్టెలో నుండి దిగారు.

కుటుంబరావు సుమతిని ఎగా దిగా పరిశీలనగా చూశాడు. ఆమె కళ్ళు మెరిశాయి. వాళ్ళిద్దరి మధ్య అప్పుడే చిగురిస్తున్న లేత ప్రేమ గులాబీ రేకులా మృదువుగా వాళ్ళ చూపులలో ప్రతిబింబించాయి.

కూలీల చేత సామానులు ఎక్కించుకుని టాక్సీలో ముగ్గురు క్వార్టర్సు చేరారు.

సంతోషంగా ఉంది వరాలమ్మ. నేటికి తను గట్టెక్కిం దనుకుంది.

కుటుంబరావు సంసారం సవ్యంగా సాఫీగా కొన్ని నెలల పాటు జరిగిపోయింది.


వరాలమ్మ, సుమతి కలిసి వంటింటి పనులు చేసుకుంటున్నారు. వీలయినంత వరకు అన్ని పనులు కూడా సుమతి చక్కబెడుతూంది.

అయితే ఈ ప్రశాంతం ఎక్కువ రోజు లుండ లేదు.

ఒక రాత్రి కుటుంబరావు ఆలస్యంగా వచ్చాడు ఇంటికి. సుమతి పట్టే మనిషి కాదేమో అతని రాకకు ముందే నిద్ర పోయింది. ఆ రాత్రి కొడుకుకు భోజనం దగ్గర వరాలమ్మనే వడ్డించింది.

"నీవు పడుకోలేక పోయావా...ఎందు కొచ్చింది శ్రమ? సుమతి వడ్డించలేక పోయిందా?" అంటూ తిని లేచాడు.

ఈ సంఘటన వరాలమ్మ మనస్సు అల్లకల్లోలం చేసింది. తను కొడుకుకు చిన్నతనంలో అన్నం కలిపి నోట్లో పెట్టేది. ఆ తరవాత ముద్దలు కలిపి వేసేది.




తరవాత దగ్గరుండి కొసిరి కొసిరి కొడుకుకు కంచంలో వడ్డించి తినిపించేది. ఈ రోజు నీ కెందుకు ఈ శ్రమ అంటాడా? సుమతి వడ్డించలేక పోయిందా అంటాడా? నా చేతి అన్నం చేదయిందా? ఆమె చేతి అన్నం అమృతమా? అని తనలో తాను తర్కించుకుంటూ అనవసరంగా బాధ పడింది.

ఆ రాత్రి ఆమెకు పడుకుంటే నిద్ర పట్టలేదు.

పెళ్ళికి ముందు తన పక్కన చాప వేసుకుని పడుకునే వాడు. ఇప్పుడు! కాలేజీలో చదువుకునే రోజులలో ఇంటి కొచ్చి—అమ్మా అమ్మా అంటూ తన చుట్టూ తిరిగి అన్ని కబుర్లు చెప్పేవాడు! ఇప్పుడు!

ఎవరో భట్టాచారి, సేన్‌గుప్త, మోహన్ అంటూ అతని ఆఫీసు విషయాలన్నీ సుమతికి చెబుతున్నాడు. ఇంగ్లీషు, తెలుగు భాషలు కలిపి మాట్లాడుకుంటున్నారు. అవును! భార్య బి. ఎ. పాసయింది కదా!

బజారు వెడితే స్కూటరు వెనకాతల స్థిరపడుతూంది సుమతి. వెళ్ళి వస్తా మమ్మా అంటారు. ఎక్కడికి, ఎందుకు చెప్పరే! ఇలా ఆలోచిస్తుంటే ఆమె కండ్ల నుండి రెండు కన్నీటి చుక్కలుకూడా రాలాయి.

తానేదో పోగొట్టుకుంది. ఏమి పోగొట్టుకుందీ ఇది అని విడమరిచి వివరంగా చెప్పలేక పోతూంది వరాలమ్మ.

ఆ రాత్రి ఎలాగో గడిపింది వరాలమ్మ.

ఆ మరునాడు ఆదివారమయింది.

ఆదివారాలు కుటుంబరావు కొంత ఆలస్యంగానే సావధానంగా లేస్తాడు. సుమతి పొద్దున్నే లేచి, ముఖం కడుగుకుని వంటింటి వైపు వెళ్ళింది.

"కాఫీ తయారు చేశాను. నీవు తాగి అతనికి ఫ్లాస్కులో పోసి ఉంచు" అంది వరాలమ్మ సుమతితో.

"అలాగే నండి" అని వెళ్ళింది.

కాసేపటికి కాఫీ తాగి, భర్తకు కాఫీ ఫ్లాస్కులో పోసి వంటింటి నుండి ఇవతలి కొచ్చింది సుమతి. వరాలమ్మ స్నానాని కెళ్ళింది.

ఆదివారమే గదా—వంటకు హడావిడి లేదనుకుని సుమతి కాఫీ తాగి గదిలో కెళ్ళింది.

వరాలమ్మ స్నానం చేసి వంట ప్రయత్నంలో ఉంది. కత్తిపీట, కూరగాయలు ముందేసుకుని కూర్చుంది.

ఒక అరగంట అయ్యాక సుమతి వంటింట్లో కొచ్చింది.

"రాత్రనక, పగలనక గది తలుపేసుకుని పడుకుంటే ఇంట్లో బోలెడు చాకిరీ ఎవరు చేస్తారు?' అంది ఆవేశంగా వరాలమ్మ.

సుమతి ఆమె మాటలకు బెదిరి పోయింది.

"ఈ రోజు ఆదివారమే గదా అని కాసేపు వెళ్ళి పడుకున్నా" అంది సుమతి మెల్లిగా.

"మీకు ఆదివారాలు గావచ్చు—నా కన్నివారాలు ఒకటే. వెళ్ళి పడుకున్న దానివి ఎందుకు లేచి వచ్చావు?"

"మీకు వంట పనిలో సాయం చేద్దామని!" మాట గట్టిగా రాలేదు.

"మీకు జీతం బత్తెం లేకుండా వంట మనిషిని నే నున్నాగా?" నిష్ఠూరంగా అంది.

అత్తగారి మాటలకు హడలి పోయింది సుమతి. అక్కడే అవాక్కయి నిలుచుంది.

"ఏం? నీకే చెప్పడం—వెళ్ళిపడుకో!"

సుమతి ఇంకొక్క క్షణం అక్కడ నిల్చులేక పోయింది. గదిలో కెళ్ళి భర్త మీదకి వాలి ఏడుస్తూంది.

"సుమతీ! ఏమయింది?" అన్నాడు కంగారుగా కుటుంబరావు.


ఆమె దగ్గర నుండి జవాబు లేదు. ఏడుస్తూనే ఉంది.

"వంట్లో బాగుంది గదా?" అడిగాడు ఆత్రంగా.

"వంట్లో బాగుంది. మీ అమ్మ అంటూ..." ఆపేసింది మాట.

"ఏమయింది అమ్మకు?"

"ఉత్తి పుణ్యాన నన్ను కోప్పడుతూంది."
"ఎందుకు?"
"ఇంట్లో బోలెడు చాకిరీట!"
"ఎందు కంత చాకిరీ!"
"ఏమో ఆమెనే అడగండి."
"నిన్ను కోప్పడిందా?"
అవునంటూ తల వూపింది.
"ఏమనింది?"
"జీతం బత్తెం లేని వంట మనిషిట తను!"
"ఆమె అలా అన్నదా!" అన్నాడు ఆలోచనగా.
అతని చాతీ మీద తలపెట్టి అవునని తల వూపింది.
ఆమె తల నిమిరాడు.
కొన్ని నిమిషాలు ఆలోచనలో పడ్డాడు.
"సుమతీ!" అన్నాడు లాలనగా.
ఏమన్నట్లు తలెత్తి అతని కళ్ళలోకి చూసింది.
"ఆమె నా తల్లి!" అన్నాడు దీనంగా.
"నాకు తెలుసు!" అంది దృఢంగా.
"తెలుసుగదా! నా కోసం నీవు ఆమెను అర్థం చేసుకోవాలి."
"ఏమని?"
విట్టూర్చాడు కుటుంబరావు.
"ఆమె జీవితంలో ఒకరోజు కూడా సుఖ పడలేదు. చిన్న వయస్సులోనే భర్త పోయాడు. నా తండ్రి పోయినప్పుడు నేను పదినెలల పిల్లవాణ్నట. డబ్బు లేదు. భర్త లేడు. నా అనే వారు లేరు. ఆదుకునేవారు లేరు. రెక్కలు ముక్కలు చేసుకొని నానా బాధలు పడి నాకు ఏ కొరత రానీయకుండా పెంచింది. ప్రేమించింది. దండించవలసినప్పుడు దండించింది. నాకు తల్లి, తండ్రి తనే అయింది.
నన్ను తన తాహతుకు మించి చదివించింది. ఒక ప్రయోజకుణ్ణి చేసింది. నేడు మనం సుఖంగా ఉన్నామంటే ఇదంతా ఆమె మనకు పెట్టిన భిక్ష! ఆమె పట్టుదల! ఆమె శ్రమ! ఆమె ఆశీర్వాదం!" అన్నాడు.
ఆ మాట లంటున్నప్పుడు అతని కళ్ళు తడి అయాయి.
"అయితే మాత్రం! ఆమె భర్త పోతే నాకు శిక్షా? నన్ను అన్ని మాటలనాలా? ఆమె కష్టాలకు నేను బాధ్యురాలినా?" అంది కొంత ఉక్రోషంగా.
"సుమతీ! నా కోసం ఆమె అనే మాటల్ని నీవు పట్టించుకోగూడదు. నేను నీ వాడను. ఎల్లప్పటికి నీ వాడను. ఈ సంసారం బాగు పడాలంటే ప్రశాంతంగా గడిచిపోవాలి. నీకు, నాకు ఓర్పు ప్రధానం.
"నే నొక్కటడుగుతానండి!" అంటూ అతని చాతీ మీది నుండి లేచి కూర్చుంది.
"ఏమిటి?"
"ఆమె మీకోసం కష్టపడిందంటే అది తల్లిగా ఆమె వంతు. అందరు తల్లులు వారివారి పిల్లల్ని పెంచడం లేదా? అది వారి బాధ్యత! అవునా?"




"పెంచుతున్నారు. కాదనలేదు. నా తల్లి ఈ బాధ్యత తీసుకోనకుంటే నేను ఈ వీధి చివర ముష్టి ఎత్తుకోవలసి వచ్చేది. ఒప్పుకుంటావా?"
"అయితే మధ్య ఆమె న న్నాడిపోసుకోవడ మెందుకంట?"
"అక్కడే వచ్చింది. తను విత్తనం నాటి, నీళ్ళుపోసి పెంచిన మొక్క వృక్షమై ఫలాలిచ్చినప్పుడు ఇంకెవరో ఆ ఫలాలు కోసుకుంటువారన్ని ఆహా! తాను పండించిన పంట ఇంకెవరో అనుభవిస్తున్నారన్న!"
"నేను ఆ ప్రతిఫలాలు అనుభవిస్తున్నా నంటారా?"
"సుమతీ! ఆమె జీవితంలో ఎప్పుడు కాలి నడకనే. బస్సు కూడా ఎక్కిన పుణ్యాన పోలేదుగాని. నీవో—స్కూటర్లో తిరుగుతున్నావు."
"అది నా అదృష్టం."
"ఆ! నీ అదృష్టాన్ని మోసే ఆమె మనస్సు కొంత చివుక్కుమంటూంది. ఈ బాధ వల్లనే అత్తగార్లు, కోడళ్ళ సమస్య పెరిగింది."
"ఈ అత్తగారి కోడళ్ళ మధ్య ఈ సమస్య లేకుండా తల్లి స్థానం తల్లిది, భార్య స్థానం భార్యది అని తెలుసుకుంటే ఎంత బాగుండును! మ్యూజికల్ చెయిర్స్ అని ఆట ఆడతారు చూడండి—ఒక కుర్చీ వేసి, ఆ కుర్చీ చుట్టు ఇద్దరు తిరుగుతారు. అలా గాక రెండు కుర్చీలు వేసి, ఇద్దరిని వారి వారి స్థానాలలో కూర్చోబెడితే!"
"అలా చేస్తే సంసారాలు సుఖంగా, హాయిగా గడిచి పోతాయి."
"ఏమండీ! మన సంభాషణ అంతా నే కూడా వింటున్నానని నా కడుపులో మెత్తటి కదలిక!" అంది.
అతడు ఆమెను పరవశంగా గుండెకు హత్తుకున్నాడు.
"ఏమండోయ్! మరచిపోయాం... గది అవతలికెడితే మీ అమ్మ నా మీద చీపురు తిరగేస్తుంది."
"ఆమె నా తల్లి అని ఎన్నటికి మరువకు. నా కోసం ఆమెను అర్థం చేసుకుంటావు గదూ!" అన్నాడ అనునయంగా.
"మీ కోసం ఏమన్నా చేస్తానండి" అంటూ గది నుండి అవతలికి నడిచింది.
సుమతి అన్నమన్నట్లే వరాలమ్మ ఆమె మీద మాటలతో దుమ్మెత్తి పోసింది. అయితే, సుమతి అన్నిటికి తల వంచింది.
నెలలు గడుస్తున్నాయి.
సుమతి ఒక కొడుకుకు తల్లి అయింది. తన కొడుకు తండ్రి అయ్యాడని సంతోషంతో ఉప్పొంగి పోయింది వరాలమ్మ. తన కొడుకుకు కుటుంబరావు గోపాలరావని తండ్రి పేరు కూడా పెట్టాడేమో...వరాలమ్మ సంతోషానికి అవధులు లేకుండా పోయింది.
రోజులు, నెలలు, ఏళ్ళు గడుస్తూనే ఉన్నాయి. వరాలమ్మ సుమతితో తప్పులెంచుతూనే ఉంది. అయిన దానికి, కాని దానికి కేకలు, పెడబొబ్బలు పెడుతూనే ఉంది. అన్నిటిని సహిస్తోంది సుమతి. ఎక్కువ బాధపడినప్పుడు ఏడుస్తోంది కాని, ఒక్కరోజు కూడా భర్తతో ఫిర్యాదు చేయలేదు. తిరిగి మాట అనలేదు.
అలాగే పదిహేనేండ్లు జరిగాయి.
గోపాల్ పెద్ద వా డయ్యాడు.
ఒకరోజు గోపాల్ స్కూలును నుండి ఇంటి కొచ్చేసరికి వరాలమ్మ ఏ కారణం చేతనో సుమతిని నానా చీవాట్లు పెడుతూంది. సుమతి చెంపల మీదుగా కన్నీళ్ళు జారుతున్నాయి.
గోపాల్ ఆ దృశ్యం చూసి వూరుకోలేక పోయాడు.
"బామ్మా! ఎందుకని అమ్మ నలా సాధిస్తావు?" అన్నాడు ఆవేశంగా.
సుమతి కొడుకు వైపు మృదువుగా చూసింది.
"హోహో! నీ అమ్మను వెనకేసుకోడానికి నీవు అవతరించావా, బాబూ!" అంది విస్ఫారంగా వరాలమ్మ.
"నీవు అమ్మను అయిన దానికి, కాని దానికి మాట లంటే నే నూరుకోను!" అన్నాడు రోషంగా.
"వూరుకోక ఏం చేస్తావురా? న న్నింటి నుండి గెంటుతావా?"
ఆ క్షణం కుటుంబరావు ప్రవేశించాడు.
"ఏమిటి గొడవ?" అన్నాడు.
"ఏమి లేదు, నాన్నా! మీరేమో ఇంట్లో ఉండరు. మీకేం తెలియదు. బామ్మ ఎప్పుడు అమ్మను సాధిస్తూనే ఉంటుంది. నేను చూస్తూ వూరుకోలేను. బామ్మ మీకు తల్లయితే ఈమె నా తల్లి! ఆమె బాధపడుతూంటే చూస్తూ నే వూరుకోను" అన్నాడు గంభీరంగా.
కుటుంబరావు సిగ్గులో తలవంచుకుని విశ్రమించాడు.
ఆరోజు నుండి ఆ సంసారం ప్రశాంతంగా సుఖంగా హాయిగా గడిచిపోయింది...ఎవరి స్థానాలు వాళ్ళు తెలుసుకున్నారు. ✱